క్లుప్తంగా

పల్లెల అభివృద్ధికి ప్రాధాన్యం

రాజోళి: గ్రామ పంచాయతీల అభివృద్ధికి సీఎం కేసీఆర్ ప్రాధాన్యం ఇస్తున్నారని ఎంపీపీ మరియమ్మ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామ పంచాయతీలకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను విడుదల చేయడం సంతోషకరమన్నారు. దీంతో గ్రామాల అభివృద్ధి మరింత వేగవంతం అవుతోందన్నారు. రోడ్లు, డ్రెయినేజీలు, శ్మశానవాటికలు, ఇంకుడుగుంతలు తదితర అభివృద్ధి పనులను చేసి పల్లెల్లో నూతన శకాన్ని తీసుకొచ్చారన్నారు. కార్యక్రమంలో నతానియేల్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

అలంపూర్: రోడ్డు ప్రమాదంలో గాయపడి కర్నూల్ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పులికల్ దేవన్నను బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మంగళవారం పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఆయన వెంట జిల్లా అధ్యక్షుడు కేశవరావు, కార్యకర్తలు ఉన్నారు. అదేవిధంగా ఎమ్మెల్యే డాక్టర్ అబ్రహం ఆస్పత్రికి వెళ్లి పులికల్ దేవన్నను పరామర్శించారు. మానవపాడు మండలం చెన్నిపాడు గ్రామానికి చెందిన ఇటిక్యాల బీసన్న, జల్లాపురం వెంకట్రాముడు అనారోగ్యంతో కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వారిని పరామర్శించారు. ఆయన వెంట జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున్, నాయకులు నరసింహ్ములు, దేవరాజు, ప్రభాకర్, భూపతి నాయుడు తదితరులు ఉన్నారు.

అందుబాటులో జీలుగ, వరి విత్తనాలు

గట్టు: జీలుగా, వరి విత్తనాలను అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ అధికారి హనుమంతురెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 25 కేజీల జీలుగ విత్తనాలు రూ.843లు, 25 కేజీలు బీపీటీ వరి విత్తనాలు రూ.890లకు లభిస్తున్నట్లు తెలిపారు. పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు తీసుకొని పీఏసీఎస్ కార్యాలయంలో సంప్రదించాలని ఏఓ కోరారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

శాంతినగర్: భారత్‌మాల రోడ్డుకు మైనింగ్ అనుమతి తీసుకుని మట్టి తరలించాలని కోరుతూ మంగళవారం వడ్డేపల్లి జెడ్పీటీసీ కాశపోగు రాజు కలెక్టర్ వల్లూరు క్రాంతికి ఫిర్యాదు చేశారు. వడ్డేపల్లి మండలంలోని తనగల గట్టు సర్వేనంబర్ 388లో 25 ఎకరాల్లో మట్టి తవ్వేందుకు రెవెన్యూశాఖ అనుమతులు తీసుకున్నారు కాని మైనింగ్, పొల్యూషన్ బోర్డు అనుమతులు లేవని వివరించారు. అక్రమంగా తవ్వకాలు చేపడుతున్నారని పేర్కొన్నారు. బుడమొర్సు గట్టు నుంచి ఎర్రమట్టి, తుంగభద్ర నదినుంచి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వానికి వందల కోట్లు గండి కొడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అక్రమంగా మట్టి, ఇసుక తరలిస్తున్న మెగా ఇంజనీరింగ్ నిర్వాహకులపై శాఖాపరంగా చర్యలు తీసుకుని తవ్వకాలను ఆపాలని కలెక్టర్‌కు విన్నవించారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

మానవపాడు: త్వరగా అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఎంపీడీఓ రమణరావు సూచించారు. మంగళవారం మండలంలోని అమరవాయిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామంలో మురుగు కాల్వలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పారిశుద్ధ్యం లోపించకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. మురుగు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అనంతరం నర్సరీలను, పల్లె ప్రకృతి వనం, సీసీ రోడ్లను పరిశీలించారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉరుములు, మెరుపులతో వర్షం

మానవపాడు: మండలంలోని చెన్నిపాడు, కలుకుంట్ల, ఏ.బుద్ధిపాడు, మద్దూరు, అమరవాయి, గోకులపాడు తదితర గ్రామాలలో మంగళవారం ఉరుములు, మెరుపులతో కుడిన వర్షం కురిసింది. రెండు గంటలపాటు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. విద్యుత్ లేక పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు

ఉండవెల్లి: మండల కేంద్రంలో జాతీయ రహదారికి వెళ్లే మార్గంలో పోలీసులు మంగళవారం డ్రంకెన్ డ్రైవ్ తనిఖీ చేశారు. మొత్తం 12 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతునట్లు గుర్తించారు. వీరిపై కేసులు నమోదు చేసిన్నట్లు ఎస్ఐ బాల్‌రాజు తెలిపారు. వాహనాలకు ఎలాంటి పత్రాలు లేక పోవడంతో 10 మందికి మొత్తం రూ.1500 జరిమానా విధించారు.

ఘనంగా బోనాల పండగ

మదనాపురం: మండలంలోని దుప్పల్లిలో మంగళవారం పెద్దమ్మ పండగను గ్రామస్తులు ఘనంగా జరుపుకొన్నారు. బంధువులు, ఆడపడుచులు, స్నేహితుల రాకతో గ్రామమంతా సందడి నెలకొంది అమ్మవారి ఆలయాన్ని రంగులతో అలంకరించి శుద్ధి చేశారు. బోనాలను ఎత్తుకొని అమ్మవారి ఆలయానికి చేరుకొని నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

గుంతలమయంగా బీటీ రోడ్లు

- వాహనదారులకు తప్పని తిప్పలు



ఉండవెల్లి మండలం బుద్దిపాడు శివారులో గుంతలమయంగా రహదారి

ఉండవెల్లి: మండలంలోని బీటీ రోడ్లు అధ్వానంగా తయారయ్యారు. మండలంలోని డి.బూడిదపాడు నుంచి కంచుపాడు, తక్కశిల వరకు, డి.బూడిదపాడు నుంచి బైరాపురం, బస్వాపురం గ్రామాల వరకు పుల్లూరు నుంచి కలుగోట్ల వరకు రోడ్లు గుంతలమయంగా దర్శనమిస్తున్నాయి. ఈ రహదారిపై ప్రయాణం చేయాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఉందని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. రోడ్డు నిర్మాణ పనులు చేపట్టి ఏళ్లు గడుస్తున్నా నేటికి సరైన మరమ్మతు పనులు చేపట్టకపోవడంతో రోడ్డంతా అధ్వానంగా మారింది. దీంతో వాహనదారులు రోడ్డుపై ప్రయాణించేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గుంతలు ఎక్కడ ఉన్నాయో తెలియక రాత్రి వేళలలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

అడుగడుగున గుంతలు..

మండలంలోని జాతీయ రహదారి నుంచి ఉండవెల్లికి వెళ్లే మార్గంలోని బీటీ రోడ్డు వేసిన ఏడాదికే దెబ్బతిన్నాయి. బైరాపురం స్టేజ్ నుంచి బైరాపురం మీదుగా కర్నూల్ వెళ్లే రోడ్డు గుంతలు ఏర్పడ్డాయి. వర్షకాలం సమీపిస్తున్న తరుణంలో గుంతలలో నీరు ఆగి ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని ప్రజలు, వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేయాలని కోరుతున్నారు.



బైరాపురంలో అధ్వానంగా ఉన్న రహదారి

నిధులు మంజూరైనా..

ఉండవెల్లి మండలంలోని బైరాపురం స్టేజ్ నుంచి బైరాపురం వయా బస్వాపురం శివారు వరకు 3.75 కి.మీ ఉండడంతో దాదాపు రూ.1 కోటి 90 లక్షలు మంజూరు అయ్యాయి. డి.బూడిదపాడు నుంచి ఉండవెల్లి, కంచుపాడు, తక్కశిల, ప్రాగటూరు, మారమునగాల–2 వరకు 10 కి.మీ మేరకు దాదాపు రూ.2 కోట్ల 50 లక్షలు కేటాయించారు. నిధులు మంజూరైన అధికారుల నిర్లక్ష్యం కారణంగా టెండర్ ప్రక్రియ పూర్తి కాలేదు. పుల్లూరు నుంచి కలుగోట్లకు ప్రయాణించే రోడ్డు పనులు కొనసాగుతున్నాయి.

ప్రయాణించాలంటే భయంగా ఉంది..

బైరాపురం స్టేజ్ నుంచి బైరాపురం గ్రామానికి వెళ్లే మార్గంలో అడుగుకో గుంత ఉంది. ఈ రోడ్డు గుండా వెళ్లాలంటే భయంగా ఉంది. రాత్రివేళ గుంతలు కనిపించక వాహనదారలు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు రోడ్లపై తాత్కాలిక పనులు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారు.

–పరుశురాం, బైరాపురం

టెండర్‌కు ముందుకు రావడం లేదు..

బైరాపురం నుంచి బస్వాపురం శివారులోని సరహద్దు వరకు బీటీ రోడ్డు మంజూరైన టెండర్‌కు కాంట్రాక్టర్లు మక్కువ చూపడం లేదు. డి. బూడిదపాడు నుంచి మారమునగాల–2 వరకు బీటీ రోడ్డు మంజూరైన టెండర్ పూర్తి కాకపోవడంతో రోడ్డు పనులకు జాప్యం చేస్తున్నారు. టెండర్ పూర్తైతే పనులు ప్రారంభిస్తాం.

– మహేష్, ఆర్అండ్‌బీ ఏఈ, ఉండవెల్లి

28న రక్తదాన శిబిరం



స్థల పరిశీలన చేస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షులు, నాయకులు

అలంపూర్: ఈ నెల 28వ తేదిన తిరుమల్ రెడ్డి జయంతిని పురస్కరించుకొని రక్తదాన శిబిరం నిర్వహిస్తునట్లు సర్పంచ్ భద్రయ్య తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం శిబిరం నిర్వహణ కోసం అయిజ మండలంలోని సంకాపురంలో స్థలాన్ని రెడ్‌క్రాస్ సొసైటీ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు నటరాజన్, గద్వాల జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఉపాధ్యక్షుడు తాహెర్, అయిజ మండల పీఏసీఎస్ మాజీ చైర్మన్ రాముడులు పరిశీలించారు. వీరితోపాటు పరుశురాముడు, బజారి, యాదవ్, గోవర్ధన్, బింగిదొడ్డి బజారి, మహబూబ్ బాషా, రామలింగం తదితరులు ఉన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహిస్తున్న కార్యదర్శులు

గట్టు: రెగ్యులర్ చేస్తూ ప్రభుత్వం నిర్ణయించడంపై జూనియర్ పంచాయతీ కార్యదర్శులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట సీఎం కేసీఆర్ చిత్రపటానికి జేపీఎస్‌లు, ఎంపీపీ విజయ్‌కుమార్ పాలాభిషేకం చేశారు. ఉద్యోగులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎంపీపీ అన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చెన్నయ్య, ఎంపీఓ మహేష్, సీనియర్, జేపీఎస్‌లు పాల్గొన్నారు.

అంధత్వ నివారణే ప్రభుత్వ లక్ష్యం



ఇర్కిచేడులో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

కేటీ దొడ్డి: అంధత్వ నివారణే ప్రభుత్వ లక్ష్యమని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు శ్రీధర్ అన్నారు. మంగళవారం మండలంలోని ఇర్కిచేడులో కంటి వెలుగు శిబిరాన్ని డాక్టర్ హరిశంకర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. 161 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 20 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు.15 మందిని కంటి అద్దాల కోసం ప్రతిపాదనలు పంపినట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీహర్ష, ఎంపీటీసీ శాంతమ్మ, ఉప సర్పంచ్ హుస్సేనమ్మ, నాయకులు ఆంజనేయులు, మోతీలాల్, ఏఎన్ఎం, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మానవపాడు: మండలంలోని చెన్నిపాడులో 4వరోజు కంటివెలుగు శిబిరం కొనసాగింది. 162 మందికి కంటివెలుగు పరీక్షలను నిర్వహించగా, 9 మందికి కంటి అద్దాలు అందజేశారు. 5 మందికి అద్దాల కోసం రిఫర్ చేశారు. కార్యక్రమంలో చంద్రన్న, శ్రావణి, లక్ష్మీనారాయణ, శారద, చిట్టెమ్మ, ఆశలు తదితరులు పాల్గొన్నారు.

గట్టు: మండలంలోని ఆలూరు, తుమ్మలచెరువు, బల్గెర గ్రామాల్లో కంటి వెలుగు శిబిరాలు మంగళవారం కొనసాగాయి. మూడు గ్రామాల్లో మొత్తం 402 మందికి కంటి పరీక్షలు, 34 మందికి కంటి అద్దాల పంపిణీ, 39 మందికి కంటి అద్దాల కోసం ప్రతిపాదనలు పంపినట్లు వైద్యాధికారులు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు తిమ్మప్ప, సాయిచరణ్, సమీరాకౌసర్, హెల్త్ సూపర్‌వైజర్లు స్వర్ణలత, బాలమ్మ, ఏఎన్ఎంలు భారతి, ఖేజీయా, రావెల, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



చెన్నిపాడులో కంటివెలుగు పరీక్షలను నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది



గట్టులోని ఆలూరులో..

శిశువు మృతి

గద్వాల క్రైం: నెలలు నిండని శిశువు మృతి చెందిన సంఘటన మంగళవారం జిల్లా ప్రభుత్వాసుపత్రిలో చోటు చేసుకుంది. వైద్యురాలు, తల్లిదండ్రుల కథనం మేరకు.. మల్దకల్ మండలం ఉల్లిగేపల్లి గ్రామానికి చెందిన వేంకటేశ్వరమ్మ 8 నెలల గర్భిణీ సోమవారం తీవ్ర జ్వరం రావడంతో వైద్య కోసం జిల్లా ప్రభుత్వాసుపత్రికి సోమవారం రాత్రి వచ్చారు. మంగళవారం ఉదయం వైద్యురాలు ప్రియాంక పరీక్షించగా బీపీ అధికంగా ఉందని వివరించింది. కడుపునొప్పి వస్తుందని గర్భిణీ వైద్యురాలికి తెలపగా కడుపులో మృత శిశువు ఉన్నట్లు గుర్తించి వెంటనే శస్త్ర చికిత్స ద్వారా శిశువును బయటకు తీశారు. ఇదిలా ఉండగా పలు సామాజిక మాధ్యమాల్లో వైద్యుల నిర్లక్ష్యంగా కారణంగానే శిశువు మృతి చెందినట్లు పోస్టులు చక్కర్లు కొట్టాయి. ఈ విషయంపై సూపరింటెండెంట్ కిషోర్‌కుమార్‌ను వివరణ కోరగా సామాజిక మాధ్యమాల్లో వస్తున్న పోస్టుల్లో ఎంత మాత్రం నిజం లేదని వివరించారు. సకాలంలో వైద్య సిబ్బంది స్పందించి గర్భిణీకి శస్త్ర చికిత్స చేశారని తెలిపారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న కారు

ఎర్రవల్లిచౌరస్తా: జాతీయ రహదారిపై ముందుగా వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనక నుంచి కారు ఢీకొని ఒకరికి గాయాలైన ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. కోదండాపురం ఎస్ఐ వెంకటస్వామి వివరాల ప్రకారం ఉండవెల్లి మండలంలోని చిన్న ఆముదాలపాడుకు చెందిన సుంకన్న బంధువులతో కలిసి ట్రాక్టర్‌లో శుభకార్యం కోసం జమ్మిచేడుకు బయలుదేరారు. వల్లూరు సమీపంలోకి రాగానే కర్నూల్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు వెనక నుంచి ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సుంకన్నను తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం కర్నూల్‌కు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తును చేపట్టినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. కాగా ప్రమాద సమయంలో ట్రాక్టర్‌లో సుమారు 30 మంది ఉన్నారు.

బైక్ బోల్తా: ఇద్దరికి గాయాలు

మానవపాడు: జాతీయ రహదారి -44పై బైక్ బోల్తా పడిన సంఘటన మంగళవారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం కర్నూల్ జిల్లాలోని గుడూరు మండలం బుర్ధిపాడుకు చెందిన శివ, నవీన్‌లు జోగుళాంబ గద్వాల జిల్లా జమ్మిచేడు జమ్ములమ్మ దర్శనానికి వచ్చారు. తిరుగు ప్రయాణంలో మానవపాడు మండలంలోని జల్లాపురం శివారు ప్రాంతంలో బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటన ఇద్దరికి గాయాలయ్యారు. స్థానికులు గమనించి క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ప్రభుత్వ ఆస్పత్రులపై నిర్లక్ష్యం తగదు

అలంపూర్: ప్రభుత్వ ఆస్పత్రులపై నిర్లక్ష్యం తగదను బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జలగరి అశోక్ అన్నారు. అయిజ పీహెచ్‌సీలో ల్యాబ్ రిపోర్టుల కోసం ఆయన మంగళవారం వెళ్లగా ల్యాబ్ ఇన్‌చార్జ్ తెల్ల కాగితం తీసుకొస్తే రిపోర్టులు ఇస్తామని సమాధానం చెప్పారని పేర్కొన్నారు. ఇదే విషయాన్ని మెడికల్ ఆఫీసర్, సీనియర్ అసిస్టెంట్ వద్దకు వెళ్లి ప్రస్తావించగా ప్రభుత్వం నుంచి పేపర్ల సరఫరా తక్కువగా ఉందని సమాధానం చెప్పారు. ఈ సందర్భంగా జలగరి అశోక్ మాట్లాడుతూ పేపర్ల సరఫరాలోనే ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వైద్యం కోసం వచ్చే వారికి మందులు ఎంత వరకు అందిస్తున్నారో అర్థమవుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందన్నారు. రోగుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని రిపోర్టులకు అవసరమ్యే పేపర్లను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

నిరుపయోగంగా కమ్యూనిటీ భవనం



బిజ్వారంలో నిరుపయోగంగా ఉన్న కమ్యూనిటీ భవనం

మల్దకల్ : మండలంలోని బిజ్వారంలో బీసీ కమ్యూనిటీ భవనం నిరుపయోగంగా ఉంది. ఎస్సీ కాలనీకి సమీపంలో ఈ భవనం నిర్మించారు. 18 ఏళ్ల కిందట రూ.6లక్షల వ్యయంతో నిర్మించినా వినియోగించుకోవడం లేదు. దీంతో యాచకులకు, మద్యం ప్రియులకు అడ్డాగా ఆవాసంగా మారింది. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన కమ్యూనిటీ భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. అధికారులు స్పందించి కమ్యూనిటీ భవనంను వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విపక్ష కౌన్సిలర్ల వార్డులపై వివక్ష ఎందుకు ?

అమరచింత: సీసీ రోడ్ల మంజూరు, అభివృద్ధి పనులు పూర్తి చేయడం విషయంలో విపక్ష కౌన్సిలర్లు ఉన్న వార్డులపై మున్సిపల్ చైర్‌పర్సన్, అధికార పార్టీ కౌన్సిలర్లు వివక్ష చూపుతున్నారని మూడోవార్డు కౌన్సిలర్, సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు ఆరోపించారు. పట్టణంలోని మూడో వార్డులో సీసీ రహదారి పేరిట చదును చేసి వదిలేసిన కాలనీని సీపీఐ బృందంతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికార పార్టీ కౌన్సిలర్ ఉన్న వార్డుకు వెయ్యి మీటర్లు సీసీ రోడ్లు మంజూరు చేస్తే విపక్ష కౌన్సిలర్ గెలిచిన రెండు, మూడు, నాలుగు వార్డులకు కలిపి వెయ్యి మీటర్లు సైతం మంజూరు చేయలేదని ఆరోపించారు. విపక్ష కౌన్సిలర్ల మధ్య తగాదా పెట్టాలన్నది అధికార పార్టీ దురుద్దేశమని విమర్శించారు. మూడో వార్డులో తనకు తెలియకుండా దీఈ, కాంట్రాక్టర్, అధికార పార్టీ నాయకులు కలిసి రోడ్డు వేస్తామని చదును చేయించారన్నారు. మే 13న రహదారి పనుల కోసం మెటీరియల్ ఏర్పాటు చేసిన కాంట్రాక్టర్ 10 రోజులవుతున్నా ఇప్పటికీ పనులు చేపట్టకపోవడం దారుణమన్నారు. పనులను ఎందుకు ప్రారంబించడం లేదని డీఈ, కాంట్రాక్టర్‌ను ప్రశ్నిస్తే వారిని కౌన్సిలర్ బెదిరించాడని దుష్ప్రచారం చేస్తున్నారని వాపోయారు. సీపీఐ నుంచి మూడో వార్డు కౌన్సిలర్‌గా ప్రజలు గెలిపించారని, వార్డులో జరగాల్సిన అభివృద్ధి పనులను అధికార పార్టీ కౌన్సిలర్లు, నాయకులు అడ్డుకోవడం, మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త కాంట్రాక్టర్‌కు మద్దతు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా వార్డులో మంజూరు ప్రకారం సీసీ రహదారులను నిర్మించాలని, లేని పక్షంలో ప్రజలతో కలిసి ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామని హెచ్చరించారు. సీపీఐ మండల కార్యదర్శి అబ్రహం, భాస్కర్, శ్యాంసుందర్, పాల్గొన్నారు.

చురుగ్గా వంతెన నిర్మాణ పనులు

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు కుడి కాలువపై వంతెన నిర్మాణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. ప్రాజెక్టు దిగువన గతేడాది రూ.13కోట్ల వ్యయంతో ప్రారంభమైన పార్కు ఏర్పాటు పనుల్లో భాగంగా టూరిజం శాఖ అధికారులు కుడి కాలువపై వంతెన నిర్మాణ పనులను ప్రారంభించారు. సందర్శకులు కాలువ అవతలి నుంచి ఇవతల వరకు రాకపోకలు కొనసాగించేందుకు వీలుగా ఈ వంతెన(బ్రిడ్జి) నిర్మాణం చేపట్టారు. మంగళవారం రెండు వైపులా భారీ పిల్లర్ గుంతల్లో కాంక్రీటు పనులు చేపట్టారు. త్వరలోనే ఈ పనులు పూర్తి చేసి పార్కును అందుబాటులోకి తీసుకువస్తామని టూరిజం అధికారులు తెలిపారు. వీటితో పాటు హోటల్, షాపింగ్ కాంప్లెక్స్ వంటి భవన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఆత్మకూర్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వారిని చైతన్య పరిచే కార్యక్రమం గ్రామాల్లో నిర్వహిస్తున్నామని బీజేపీ ఫ్లోర్ లీడర్ అశ్విన్‌కుమార్ తెలిపారు. మండలంలోని పిన్నంచర్లలో బూత్ నంబర్ 220, 221లో బీజేపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ఇంటింటికీ వివరించారు. ఈ సందర్భంగా రూపొందించిన వాల్‌పోస్టర్లు అతికించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నాగేంద్రం, బ్రహ్మయ్య, భూపాల్‌యాదవ్, అశోక్‌నంద పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం



మాట్లాడుతున్న అతికూర్ రహ్మాన్

గద్వాల అర్బన్: ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతామని వైఎస్సార్ టీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అతికూర్ రహ్మాన్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పోరాటాల కారణంగా ప్రభుత్వ దిగివచ్చి గ్రామ పంచాయితీలకు నిధులు విడుదల చేసిందన్నారు. సమావేశంలో యూనుస్, అంజనేయులు, ఇలియాస్, నర్సన్న, శాస్త్రి తదితరులు ఉన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ స్వరూపరాణి

మల్దకల్: పౌష్టికాహారంతో గర్భిణులు, బాలింతలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని డాక్టర్ స్వరూపరాణి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషకాలు ఉండే ఆహారాన్ని తీసుకోవాలని గర్భిణులకు సూచించారు. ప్రతి నెల వైద్యపరీక్షలు చేయించుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్, శ్రీధర్, జ్యోతి, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

రెండోరోజు ఎన్‌క్యూఏఎస్ బృందం తనిఖీ



మాట్లాడుతున్న బృందం సభ్యులు

రాజోళి: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఎన్‌క్యూఏఎస్ బృందం సభ్యులు రెండోరోజు మంగళవారం తనిఖీలు చేశారు. ఇందులో భాగంగా గర్భిణులు, బాలింతల వివరాలు తెలుసుకున్నారు. ప్రసవం అనంతరం బాలింతలకు ఎలాంటి మందులు అందిస్తున్నారని, వ్యర్థాలను ఎక్కడ వేస్తున్నారని ఆరా తీశారు. రోజువారీగా వాడే సిరంజిలు, కాటన్, బ్యాండేజీ తదితర వ్యర్థాలను ఎలా విచ్ఛిన్నం చేస్తున్నారని వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి లోపల, బయటి పరిసరాల్లో మలవిసర్జన ఇతర అపరిశుభ్రత ఏర్పడకుండా తీసుకుంటున్న చర్యలు గురించి చర్చించి వివరాలు నమోదు చేసుకున్నారు. రోగులకు ఓపీ చూస్తున్న విధానాలను పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆస్పత్రిలో అందాల్సిన సేవలు, గుర్తించిన లోటుపాట్లను వారు సిబ్బందికి తెలిపారు. అనంతరం బృందం సభ్యులకు స్థానిక ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది బతుకమ్మను అందించి, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ హర్షాల సుధాకర్ వేదక్, డాక్టర్ భిందియా రాజ్‌పుత్, మెడికల్ ఆఫీసర్ మధుబాబు, రామకృష్ణ, రంజిత్‌కుమార్, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ స్నేహా

ఎర్రవల్లిచౌరస్తా: అభివృద్ధి పనులపై అధికారులు నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని ఎంపీపీ స్నేహా హెచ్చరించారు. ఇటిక్యాల మండల కేంద్రంలోని ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా ఆర్థిక సంఘం నిధులు, జనరల్ నిధులతో పాటు ఆయా గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్య వహించొద్దన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతోనే పల్లెల ప్రగతి సాధ్యమన్నారు. సంక్షేమ పథకాలు నిజమైన అర్హులకు మాత్రమే అందేలా చూడాలని అధికారులకు సూచించారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వ పెద్ద పీట వేస్తోందన్నారు. గ్రామాల్లో గుర్తించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నార. సభలో ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రజా ప్రతినిధులు ఎంపీపీ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుజాత, ఎంపీడీవో రాఘవ, డీటీ నందిని, విద్యుత్ ఏఈ వెంకటేశ్వరావు, ఆయా శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పక్కన ముళ్ల కంప తొలగింపు



ముళ్ల చెట్లను తొలగింపును పరిశీలిస్తున్న ఎంపీపీ

గట్టు: మండల కేంద్రం–మాచర్ల గ్రామాల మధ్య రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగినా ముళ్ల చెట్లను మంగళవారం తొలగించారు. రెండు గ్రామాల మధ్య రోడ్డుకు ఇరువైపులా చెట్ల కొమ్మలు రోడ్డుపైకి వాలడంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. గ్రామస్తుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఎంపీపీ విజయ్‌కుమార్ జేసీబీ సహాయంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్ల కంపలను తొలగించారు. గ్రామస్తులు ఎంపీపీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మునిచందర్‌గౌడ్ ఉన్నారు.